ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
ఆదివారం 11 ఫిబ్రవరి 2024



- గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లకు ప్రత్యేక పద్దు
- ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- తెలంగాణ స్కూళ్లకు బడ్జెట్ కేటాయింపులు
- రాష్ట్ర ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

ఆరు గ్యారెంటీలకు పెద్దపీట



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఆరు గ్యారంటీ పథకాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో పెద్ద పీట వేసింది. ప్రత్యేకించి ఆరు గ్యారంటీల పేరిట కేటాయింపులు చేసింది. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ప్రత్యేక పద్దులను కేటాయించింది. రైతుబంధు పథకాన్ని సమీక్షించి వచ్చే సీజన్ నుంచి ఎకరానికి 15 వేలు ఇస్తామని, కౌలు రైతులకు కూడా ఆర్థిక సాయం అందిస్తామని, 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీని వర్తింపజేస్తామని, పంటల బీమాను అమలు చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించడం రైతులకు భరోసా ఇచ్చినట్లయ్యింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడంతో బడుగుబలహీన వర్గాల ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తొమ్మిదిన్నర ఏళ్ల తర్వాత సొంతింటి కల నెరవేరనున్నది. శనివారం అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2,75,891 కోట్ల



రూపాయలతో ఓటు ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ పథకాలు ప్రజలను ఆకర్షించే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని, మహిళలకు నెలకు 2,500 రూపాయలు ఇస్తామని, వంట గ్యాస్‌ను 500 రూపాయలకే ఇస్తామని ప్రకటించారు. గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం కింద ఎకరానికి రెండు పంటలకు కలిపి 15 వేలు, కౌలు రైతులకు 15 వేలు, కూలీలకు 12 వేలు ఇస్తామని ప్రకటించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారికి 5 లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. చేయూత కింద ఇప్పుడు ఇస్తున్న పింఛన్లను డబుల్ చేస్తామని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. యువ వికాసం ద్వారా విద్యార్థులకు 5 లక్షల రూపాయల వరకు సాయం అందిస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు వైద్య సేవలను అమల్లోకి తీసుకవచ్చారు. త్వరలో గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించేందుకు, 500 రూపాయలకే వంట గ్యాస్ ఇచ్చేందుకు వివరాలు సేకరిస్తున్నారు. ఈ పథకాలను అమలు చేసేందుకు బడ్జెట్‌లో 53,196 వేల కోట్లు, గృహజ్యోతి కోసం 2,418 కోట్లు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 7,740 కోట్లు కేటాయించారు. ప్రతి నియోజకెవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంతో జిల్లాకు 9 వేల వరకు ఇళ్లు కేటాయించే అవకాశాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాల భవనాల నిర్మాణాల కోసం ఎస్సీ ఎస్టీ భవనాల కోసం 1250 కోట్లు, బీసీ భవనాల కోసం 1546 కోట్లు కేటాయించారు. మైనార్టీ సంక్షేమానికే కేటాయించిన బడ్జెట్ నుంచే భవనాలను నిర్మాణాలను చేపట్టనున్నారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయింపులు ఉంటాయని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్‌కంటే తక్కువగా 8 వేల కోట్లు మాత్రమే కేటాయించడంతో బీసీ వర్గాలు నిరాశనిస్పృహలకు గురవుతున్నారు. జిల్లాకు ప్రత్యేకించి బడ్జెట్ కేటాయింపులు లేనప్పటికీ, ఆయా శాఖల ద్వారా కేటాయించిన నిధులతోనే జిల్లాలో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశాలున్నాయి. ఇది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కావడంతో పార్లమెంట్ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారని తెలుస్తున్నది. రాష్ట్ర బడ్జెట్‌పై వివిధ రాజకీయ పార్టీలు, వివిధ వర్గాల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

బీసీలకు మొండి చెయ్యి..



- ఆకుల స్వామి వివేక్ పటేల్, బీసీ జాతీయ సంఘం నాయకులు

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు మొండి చెయ్యి చూపారు. ఎస్సీ, ఎస్టీల కంటే కేవలం 8 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. రాష్ట్రంలో 56 శాతం మంది బీసీల జనాభా ఉంటే తక్కువ మొత్తంలో బడ్జెట్ పెట్టడం అన్యాయానికి గురి చేసినట్లయ్యింది. ఎన్నికల సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలే పేరిట బీసీ సబ్‌ప్లాన్ తీసుకవస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ ఆ హామీ నెరవేరేలా బడ్జెట్‌ను చూస్తే కనబడడం లేదు.

● ఆరు గ్యారంటీల అమలుపై భరోసానిచ్చే బడ్జెట్..

- సీహెచ్ విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే



అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఆరు గ్యారంటీ పథకాల అమలుపై ప్రజలకు భరోసా ఇచ్చినట్లయ్యింది. ఇంతకు ముందెప్పుడు ఇలాంటి బడ్జెట్‌ను గత ప్రభుత్వం ప్రవేశపెట్టలేదు. ఆడంబరాలకు వెళ్లకుండా అన్ని రంగాలకు పెద్దపీట వేసే విధంగా, అన్ని వర్గాల ప్రజలు మెచ్చే విధంగా బడ్జెట్ ఉంది. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల కేటాయించడం బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మరింత న్యాయం జరగనున్నది. గురుకుల విద్యాలయాలకు శాశ్వతంగా భవనాలు నిర్మించేలా బడ్జెట్ కేటాయించడం హర్షణీయం. రైతుబంధు, రుణ మాఫీపై ప్రభుత్వం కట్టుబడి ఉంది.

● అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్..

- రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, రామగుండం ఎమ్మెల్యే



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోద యోగ్యంగా ఉంది. ఆరుగ్యారంటీ పథకాలను అమలుచేసే దిశగా, బడుగు, బలహీన వర్గాల ప్రజలను, రైతులను ఆదుకునే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కటొక్కటిగా నెరవేర్చే విధంగా బడ్జెట్ ఉంది. విద్య, వైద్యానికి, గ్రామీభివృద్ధి, పట్టణాభివృద్ధికి, గృహజ్యోతి అమలుకు ఎక్కువ కేటాయింపులు జరిపారు. ఇది అందరు మెచ్చే బడ్జెట్.

● సంపూర్ణంగా నిధుల కేటాయింపుల్లేవు..

- పుట్ట మధూకర్, జడ్పీ చైర్మన్



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్నికల సమయంలో వారు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీములకు సరిపడా నిధులను కేటాయించలేదు. బడ్జెట్‌లో పొందుపరిచిన అంశాలను చూస్తే వారు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలో ఏ ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో నిలబెట్టుకునే పరిస్థితి కనిపించడం లేదు. రైతుబంధు, రుణమాఫీపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. వారి ఇష్టానుసారంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగింది.

● రైతులకు భరోసా ఇవ్వని బడ్జెట్

- కోరుకంటి చందర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రైతులకు భరోసానిచ్చే విధంగా లేదు. వ్యవసాయానికి కేటాయించిన బడ్జెట్ 19,746 కోట్లు కాగా, ఈ బడ్జెట్‌తో రైతులకు 2 లక్షల రుణ మాఫీ, ఏడాదికి రూ.15 వేల రైతుబంధు, పంటల బీమా, వరికి బోనస్ ఏ విధంగా ఇస్తారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరే పరిస్థితులు కనబడడం లేదు. బీసీ సంక్షేమానికి తక్కువ మొత్తంలో బడ్జెట్ కేటాయించారు. నీటి పారుదల రంగానికి కూడా తక్కువ కేటాయింపులు చేశారు. ప్రజలకు ఆమోద యోగ్యంగా లేదు ఈ బడ్జెట్.

● కార్మిక లోకాన్ని విస్మరించారు..



- ఎరవెల్లి ముత్యంరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్లో రాష్ట్రంలోని కార్మిక లోకాన్ని విస్మరించింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచిన విధంగా వివిధ రంగాల కార్మికులకు కనీస వేతనాల పెంపుదలకు ప్రతిపాదనలు లేవు, నిధులు కేటాయించలేదు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పర్మనెంట్ ఊసే లేదు. రాష్ట్రంలో కోటిన్నర మంది కార్మికులను విస్మరించే విధంగా బడ్జెట్ ఉండడం నిరాశకు గురిచేస్తున్నది.

● ప్రజలను మభ్యపెట్టడానికే ఎన్నికల బడ్జెట్

- చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలను మరోసారి మభ్య పెట్టడానికి అసెంబ్లీలో ఆచరణకు సాధ్యం కాని బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు కనిపిస్తున్నది. గత సంవత్సరం రాష్ట్ర ఆదాయం 1.6 కోట్లు ఉంటే, 2.75లక్షల కోట్లతో బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం చూస్తే హాస్యాస్పదంగా ఉంది. లక్ష కోట్ల డిఫరెంట్ బడ్జెట్‌లో కనిపిస్తుంది. వేల కోట్ల లోటు బడ్జెట్ ఎలా పూడ్చుతారో స్పష్టత ఇవ్వలేదు. ఇప్పుడున్న సంక్షేమ పథకాలను తామే అమలు చేస్తున్నట్లు బడ్జెట్‌లో చూపించి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కాంగ్రెస్ వాళ్ళు ప్రయత్నాలు చేస్తున్నారు.



ఉసురుతీసిన కలుషిత ఆహారం

- ఇద్దరు వలస కార్మికుల మృతి
- చికిత్స పొందుతున్న మరో 33 మంది కార్మికులు
- విచారణ జరిపిన అధికారులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : కలుషిత ఆహారం, నీరు ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు వచ్చిన ఇద్దరు వలస కార్మికుల ఉసురుతీసింది. పెద్దపల్లి మండలంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని గౌరెడ్డిపేట ఎంఎస్ఆర్ ఇటుక బట్టీలో పనిచేసేందుకు ఒడిషా రాష్ట్రం నుంచి వచ్చిన కార్మికులు కలుషిత ఆహారం తిని కలుషిత నీళ్లు తాగి అస్వస్థతకు గురై ఇద్దరు వలస కార్మికులు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో 33మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పెద్దపల్లి మండల పరిధిలోని గౌరెడ్డిపేట శివారులోగల ఎంఎస్ఆర్ ఇటుక బట్టీలో ఒరిస్సాకు చెందిన కార్మికులు పని చేస్తున్నారు. ప్రతి గురువారం కార్మికులు పెద్దపల్లి పట్టణానికి వచ్చి వారికి అవసరమైన నిత్యావసర సరుకులను కొనుక్కొని వెళ్తారు. గురువారం కూడా చికెన్, బోటీ వంటివి కొనుగోలు చేసి తీసుకెళ్లినట్లు తోటి కార్మికులు తెలుపుతున్నారు. ఇటుక బట్టీల సమీపంలో కొందరు వ్యక్తులు వచ్చి పంది మాంసాన్ని విక్రయించడంతో కార్మికులు కొనుగోలు చేసినట్లు సమాచారం. అవన్నీ వంట చేసుకుని తిన్నారని, అలాగే కలుషితమైన నీటిని తాగడం వల్ల పలువురు కార్మికులు వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. దీంతో వారికి ఇటుక బట్టీ వద్దనే ఆర్ఎంపీని పిలిపించి ప్రాథమిక చికిత్స అందించారు. బాధితుల్లో 16 మందికి పరిస్థితి విషమించడంతో ఈనెల 9న కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి మరో ఐదుగురిని చికిత్స కోసం వచ్చారు. వీరిలో బిష్ణు అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో చంద్రశేఖర(54) అనే కార్మికుడు చికిత్స పొందుతూ 9న మరణించడంతో పోస్టుమార్టం నిర్వహించి అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. మరొకరు లలితా మాది(26) చికిత్స పొందుతూ తెల్లవారు జామున 2 గంటల సమయంలో మృతిచెందింది. మరో 17మంది వలస కార్మికులు ఆర్ఎంపీ దగ్గర వైద్యం అందిస్తుండటంతోపాటు ఇంకొంత మంది పెద్దపల్లి, కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇటుక బట్టీ యజమాని వీరిని సకాలంలో ఆసుపత్రికి తీసుకరాకపోవడం వల్లనే ఇద్దరు మృతి చెందినట్లుగా తెలుస్తున్నది. పని చేసే స్థలాల్లో కార్మిక శాఖ నిబంధనల ప్రకారం మౌలిక వసతులు కల్పించాల్సి ఉండగా వాటి గురించి యజమానులు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్మికులకు తాగడానికి నీటి వసతి కల్పించని కారణంగా సమీపంలోని కుంట నుంచి గానీ, వ్యవసాయ బావుల వద్ద నుంచి గానీ నీళ్లు తెచ్చుకుంటున్నారని పలువురు కార్మికులు పేర్కొంటున్నారు. కలుషిత నీళ్లు తాగడం వల్లనే కార్మికులు అస్వస్థతకు గురయ్యారని, ఇద్దరు కార్మికులు చనిపోయారని ఇటుక బట్టీ యజమానిపై చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు కోరుతున్నారు. ఈ ఘటనపై బసంత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇట్టి విషయాన్ని పెద్దపల్లి సీఐ కృష్ణ సమక్షంలో విచారణ జరుపుతున్నారు.



విచారణ చేపడుతున్న జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్





పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

● ఆలస్యంగా వెలుగులోకి..

పెద్దపల్లి మండలంలోని ఇటుక బట్టీలో వలస కార్మికులు తిన్న ఆహారం విషతుల్యం కావడంతో స్థానిక ఆర్ఎంపీతో నామమాత్రంగా వైద్యం చేయించి ఇటుక బట్టీల యజమానులు చేతులు దులుపుకున్నారు. పరిస్థితి విషమించడంతో ఇటుక బట్టీల యజమానులు కార్మికుల వెంట కొంతమందిని ఏర్పాటుచేసి వారికి రోజు వారిగా రూ.1000 చెల్లిస్తున్నారు. ఇటుక బట్టీల కార్మికులతో పని చేయించుకున్న యజమానులు వారికి ఏదైనా సమస్య వస్తే ఇతరులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మండలంలోని గౌరెడ్డిపేటలోని ఎంఎస్ఆర్ బట్టీలో ఈనెల 9న కార్మికులు తిన్న ఆహారం కలుషితం కావడంతో ఎటువంటి అనుమానం రాకుండా కరీంనగర్‌కు తరలించారు. ఆ నోట ఈ నోట బయటికి పొక్కడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

● స్పందించని కార్మిక శాఖ అధికారులు

ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వలస కార్మికులపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించిన సంబంధిత రెవెన్యూ, కార్మిక శాఖ అధికారులు స్పందించని పరిస్థితి నెలకొంది. ఇద్దరు కార్మికులు చనిపోయినా కూడా కార్మిక శాఖ అధికారులు అటువైపు దృష్టి సారించలేదు. కార్మికుల స్థితిగతులను తెలుసుకోవాలని జిల్లా శాఖ అధికారులు పలుమార్లు సూచించినా కూడా పెద్దపల్లి కార్మిక శాఖ అధికారులు నామమాత్రంగా స్పందిస్తున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలో ప్రతి కార్మికుల వివరాలను తెలుసుకోవాల్సిన అధికారుల వద్ద కనీసం సమాచారం లేకపోవడం గమనార్హం. కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు.

● ఇటుక బట్టీలో వైద్యాధికారుల విచారణ

పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట ఇటుక బట్టీలో కలుషిత ఆహారం తినడం వల్ల ఇద్దరు మృతిచెందడంతో జిల్లా అధికారులు స్పందించారు. శనివారం జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మమతలు ఇటుక బట్టీని పరిశీలించి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతిచెందిన కుటుంబ సభ్యులు ఎలాంటి ఆహారం తీసుకున్నారు.. వారు మార్కెట్‌కి వెళ్లి ఏ విధమైన ఆహార పదార్థాలు తెచుకున్నారు.. అనే విషయంపై తోటి కార్మికులను ఆరాతీశారు.

కిడ్నాపర్లు సంచరిస్తున్నారంటూ వదంతులు

నమ్మవద్దంటున్న పోలీసులు

పెద్దపల్లిటౌన్ ఫిబ్రవరి 10: జిల్లా కేంద్రంలో చిన్నారుల కిడ్నాపర్లు తిరుగుతున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. కిడ్నాపర్లు నల్ల మాస్కులు ధరించి వీధుల్లో పలువురి ఇళ్లలో చిన్నారుల కోసం వెతికినట్లు, అలాగే హిజ్రాల వేషంలో తిరుగుతూ ఒంటరిగా ఉన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారని పెద్దఎత్తున వదంతులు వస్తున్నాయి, పిల్లలను తీసుకెళ్లి శరీర అవయవాలు అమ్ముకుంటున్నారని ఆందోళన గురవుతున్నారు. బీహార్ చెందిన 70 మంది ముఠా పెద్దపల్లిలో దిగి పట్టణంలో సంచరిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. అయితే పట్టణంలోని గీతాంజలి, ఇండియా మిషన్ హైస్కూల్ వద్ద మాటు వేసి చాక్లెట్స్ పండ్లు ఇస్తామని ఎర చూపుతున్నారని. మత్తు పదార్థాలు చల్లి తీసుకెళ్తున్నారని రైల్వేస్టేషన్లో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నట్లు, ఇండియా మిషన్ హైస్కూల్ చెందిన బాలికను ముగ్గురు దుండగులు వెంబడించారని.. ఇలా చర్చించుకుంటున్నారు. తమ పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే ఈ విషయమై ఎస్సై మల్లేష్‌ను వివరణ కోరగా, ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరుగలేదని, అలాంటి వదంతులు నమ్మి జనం భయపడవద్దని. ప్రజారక్షణ కోసం పోలీస్ ఎల్లవేళలా ఉంటుందని. ఏదైనా అనుమానం వస్తే 100 డయల్‌కు చేయాలని సూచించారు.

ఎవరూ భయాందోళనకు గురికావద్దు..

మంథని, ఫిబ్రవరి 10: మంథని పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురికావద్దని, పిల్లలను ఎత్తుకుపోయే ముఠా తిరుగుతుందని పుకార్లను నమ్మవద్దు.. అలాగే ప్రచారం చేయవద్దని ఎస్ఐ కిరణ్ కుమార్ శనివారం సూచించారు. సోషల్ మీడియాలో ఇటీవలే వస్తున్నటువంటి వదంతాలు నమ్మి, ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలలో ఎవరైనా అనుమానితులుగా సంచరించినట్లైతే వెంటనే 100కు లేదా 87126 56529 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు రక్షణగా ఉందని, అనవసరపు భయాందోళనలు చెంది ఇతరులను కూడా భయభ్రాంతులకు గురిచేయవద్దని కోరారు. పెట్రోలింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు మంథని మొత్తం పహారా కాస్తున్నారని తెలిపారు.

మహాలక్ష్మి డేటా ఎంట్రీలో జాప్యం వద్దు



కొలనూర్‌లో డేటా ఎంట్రీ వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మధుమోహన్

ఓదెల, ఫిబ్రవరి 10: పెద్దపల్లి నియోజకవర్గంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న మహాలక్ష్మి దరఖాస్తుదారుల డాటా ఎంట్రీలో జాప్యం చేయవద్దని ఆర్డీవో మధుమోహన్ సూచించారు. మండలంలోని కొలనూర్‌లో శనివారం మహాలక్ష్మి పథకం కోసం ఇచ్చిన దరఖాస్తులలోని వివరాల నమోదును ఆర్డీవో మధుమోహన్ పరిశీలించారు. అక్కడ మహిళలతో మాట్లాడుతూ తప్పులను పరిశీలించి జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తుల్లోని తప్పులను జాగ్రత్తగా సరిచూసుకుంటూ ఆధార్, గ్యాస్ బుక్ నెంబర్లు, రేషన్‌కార్డుల నంబర్లు నమోదు చేయాలని కోరారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ యాకయ్య, ఆర్ఐ రాజేందర్, గ్రామకార్యదర్శి మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

చొప్పదండి, ఫిబ్రవరి 10: చొప్పదండి నవోదయ విద్యా లయంలో 9, 11వ తరగతిలో ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది తరగతి పరీక్ష కోసం 1,745 మంది దరఖాస్తు చేసుకోగా 1,023 మంది పరీక్ష రాశారని తెలిపారు. 11వ తరగతిలో 1,144 మంది దరఖాస్తు చేసుకున్నారని, 769 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

చొప్పదండి, ఫిబ్రవరి 10: మండలంలోని రుక్మాపూర్ కస్తూర్బా పాఠశాల విద్యార్థిని పి అమూల్య రాష్ట్ర స్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక అయింది. అమూల్య రూపొందించిన ప్రొటెక్షన్ ఫ్రమ్ మ్యాన్ హోల్ అనే ఎగ్జిబిట్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేశారు. భారీ వర్షం కురిసినప్పుడు పట్టణాల్లో మ్యాన్ హోల్ ద్వారా ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో ప్రొటెక్షన్ ఫ్రమ్ మ్యాన్ హోల్ అనే పరికరాన్ని రూపొందించడంతో ఆమెను అవార్డుకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి అవార్డుకు అమూల్య ఎంపిక కావడంపై ప్రత్యేకాధికారి భార్గవి, గైడ్ టీచర్ స్వప్న ఆమెను అభినందించారు.

ఎన్‌సీడీసీ, బీఐఆర్‌డీ గవర్నింగ్

కౌన్సిల్ మెంబర్‌గా 'కొండూరు'

● వరుసగా రెండో సారి నామినేట్



కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 10: నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌సీడీసీ), బ్యాంకర్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (బీఐఆర్‌డీ) గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా కరీంనగర్ జిల్లాకు చెందిన నాఫ్‌స్కాబ్, టెస్కాబ్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు వరుసగా రెండోసారి నామినేట్ అయ్యారు. దక్షిణ భారత సహకార రంగానికి రెండోసారి నామినేట్ కావడం అరుదైన గౌరవంగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్‌షా నేతృత్వంలోని ఎన్‌సీడీసీ వివిధ రకాల రుణాలు, వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సహాయం మంజూరు చేయడానికి, దాని ఆర్థిక సామర్థ్యం పెంపొందించేందుకు ఒక ప్రధాన సంస్థకు గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా నామినేట్ అయ్యారు. మూడేళ్ల పదవీ కాలంలో ఆయన ప్రతి త్రైమాసికంలో ఒకసారి జరిగే సమావేశంలో పాలక మండలి సభ్యుడిగా పాల్గొంటారని ఉద్యోగులు పేర్కొన్నారు. నాబార్డు ప్రధాన సంస్థ అయిన బీఐఆర్‌డీ పాలకమండలి సభ్యుడిగా తిరిగి నామినేట్ అయిన కొండూరు రవీందర్‌రావు ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. గ్రామీణ సహకార రంగం, వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులందరికీ శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంచేందుకు బీఐఆర్‌డీ పనిచేస్తుందని తెలిపారు. దేశంలోనే ప్రధాన సంస్థలైన ఎస్‌సీడీసీ, బీఐఆర్‌డి సంస్థలకు గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా రవీందర్‌రావు తిరిగి నామి నేట్ కావడం తెలంగాణ రాష్ట్ర సహకార రంగానికి, కరీంనగర్ జిల్లాకు గర్వకారణమని పలు వురు ఉద్యోగులు, పాలకవర్గ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 10: అనారోగ్యంతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓగులాపూర్‌కు చెందిన రొట్టె శ్రీధర్(26)అనే యువకుడు కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కుమారస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలూ బీజేపీవే

- ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు
- మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం
- కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



కొండగట్టులో పూజలు చేస్తున్న ఎంపీ బండి సంజయ్

మల్యాల, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారనున్నాయని లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానంతో పాటు రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాలనూ బీజేపీ గెలుచుకుంటుందని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో చేపట్టిన ప్రజాహిత యాత్ర ప్రారంభానికి ముందు బండి సంజయ్ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. యాత్ర విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయన్నారు. తెలంగాణ ప్రజలు రాముని వారసులని రామున్ని నమ్ముకున్న పార్టీకే వాళ్లంత ఓట్లు వేస్తారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నింటా ప్రజలను మోసం చేయగా వారి పేరు చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం టైమ్ పాస్ చేయాలని చూస్తుందని సంజయ్ విమర్శించారు. బీజేపీ యాత్రలపై సంజయ్ మాట్లాడుతూ ప్రజాసమస్యలు తెలుసుకొని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడుతామన్నారు. అందుకే ఏడాది క్రితం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్రంలో 1600 కి.మీ మేర ప్రజా సంగ్రామ యాత్రను చేశానన్నారు. నిరుద్యోగ, రైతుల సమస్యల కోసం పోరాడినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజాహిత యాత్ర ద్వారా కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం మొత్తం ప్రధాని నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయడం కోసం ప్రజలను కోరనున్నట్లు వివరించారు. కరోనా సమయంలో ప్రపంచం అతలాకుతలం అయినప్పటికీ మన దేశం సుస్థిరంగా ఉండడం, ప్రజలందరికీ ఉచితం కొవిడ్ టీకాలను అందించిందని అలాగే వివిధ దేశాలకు సరఫరా చేసిందని అన్నారు.

● దేవుళ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం శఠగోపం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ దేవుళ్లతో పాటు దేవుళ్లను నమ్ముకున్న భక్తులను కూడా మోసం చేశాడని బండి సంజయ్ ఆరోపించారు. వేములవాడకు రూ.500 కోట్లు, కొండగట్టుకు రూ.100 కోట్లు అని వాటిని ఇవ్వకుండా ఆయా దేవుళ్లకు శఠగోపం పెట్టారని విమర్శించారు. తాను ప్రసాద్ పథకంలో వేములవాడ, కొండగట్టులను చేర్చడానికి చర్యలు తీసుకుంటే బీజేపీకి పేరు వస్తుందనే సెపంతో బీఆర్ ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఆయన వెంట నాయకులు బింగి వేణు, నేరెళ్ల శ్రావణ్, వెంకటస్వామి, జనగాం రాములు, కొక్కెర మల్లేశం యాదవ్, కెల్లెటి రమేష్, సామ మహిపాల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు



భీమారంలో స్థానికులతో మాట్లాడుతున్న బండి సంజయ్

● మోదీ గెలిస్తే రామరాజ్యం..

మేడిపల్లి: మోడీ మళ్లీ గెలిస్తే రామరాజ్యం వసుందని.. కాంగ్రెస్ గెలిస్తే ఇటలీ అవుతందని ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాహిత యాత్రను శనివారం మేడిపల్లిలో ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశ ప్రజలు కలలో కూడా ఊహించని విధంగా అయోధ్యలో రాముడి గుడి నిర్మించామన్నారు. రామ భక్తులు రాముడిని నమ్మే పార్టీకే ఓటువేయాలని కోరారు. రాముడి అక్షింతలను రేషన్ బియ్యం అన్న కాంగ్రెస్ వాళ్లు పీవీ నర్సింహరావుకు భారత రత్న ప్రకటిస్తే కనీసం అసెంబ్లీలో కృతజ్ఞత తీర్మానం చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే ఐదు లక్షల కోట్ల రూపాయలు కావాలన్నారు. కానీ బడ్జెట్‌లో 53 వేల కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ గల్లంతు అవుతుందని జోస్యం చెప్పారు. తనకు హాని చేయాలని తాంత్రిక పూజలు చేసిన నాయకుడు కేసీఆర్ అని, ఎదుటి వారి నాశనం కోరేవారు తమకి తామే పతనం అవుతారన్నారు. ప్రజా సేవ కోసం నిరంతరం పనిచేస్తూ ప్రజాసమస్యలపై ప్రజా సంగ్రామ యాత్ర చేస్తే కేసీఆర్ తనపై 100 పైగా కేసులు పెట్టి రెండు సార్లు జైలులో వేయించాడని అవేదన వ్యక్తం చేశారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి 590 కోట్ల 91 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ప్రజాహిత యాత్ర మేడిపల్లితో పాటు కొండాపూర్, మీదుగా బీమారం మండలానికి చేరుకుంది.అయన వెంట చెన్నమనేని డా. వికాస్‌రావు, జిల్లా అధ్యక్షుడు సత్యానారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పార్ల మెంటు కన్వీనర్ ప్రవీన్‌రావు, కో కన్వీనర్ ధశరథరెడ్డి, మండల అధ్యక్షులు ముంజ శ్రీనివాస్‌గౌడ్, అన్నడి జలపతిరెడ్డి, జగన్‌రెడ్డి, నారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ధర్మరెడ్డి, రాజు, మధు, గణేష్, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుందని ఎంపీ బండి సంజయ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం రాత్రి ప్రజాహిత యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలం లోని ఊరూరా తిరుగుతూ గడప గడపకు తిరిగి మోదీ ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు, పిల్లలతో సెల్ఫీలు దిగుతూ, వృద్ధులను పలుకరిస్తూ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని బొమ్మెన, తక్కళ్లపల్లి, సిరికొండ గ్రామాల్లో ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత పాదయాత్ర నిర్వహించారు. వీధుల వెంట తిరుగుతూ చిన్నారులు, మహిళలు, వృద్ధులకు కరచాలనం చేశారు. స్థానికంగా ఉన్న అంబేద్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. రాత్రి మండలంలోని సిరికొండలో బస చేశారు. నియోజకవర్గ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, పిడుగు ఆనందరెడ్డి, పిడుగు ప్రతాప్, కొర్నెడ్డి జలంధర్‌రెడ్డి, బద్రి సత్యం, ఎడ్మల వినోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

30క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

హుజూరాబాద్, ఫిబ్రవరి 10: పేదలకు బియ్యం పంచాల్సిన రేషన్ డీలరే బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి తెలి పారు. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సహన సుల్తానా ఆమె భర్త రహీం సహకారంతో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కామారెడ్డికి చెందిన బ్రోకర్‌కు విక్రయించేందుకు కరీంనగర్‌కు చెందిన రేవెల్లి అనిల్‌కుమార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. మహేంద్ర ట్రాలీ వాహనం ద్వారా డ్రైవర్ రేవెల్లి జంపయ్యకు అప్పగించగా అప్పటికే మాటు వేసి రాజపల్లి గ్రామం వద్ద ఉన్న ఎస్ఐ సాంబయ్యగౌడ్‌కు అనుమానం వచ్చి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారన్నారు. దానిలో పైన ఖాళీగా అన్ని సంచులు లోపల రేషన్ బియ్యం సంచులు పెట్టి తరలిస్తున్నట్లు గుర్తిం చారన్నారు. డ్రైవర్‌ను, వాహనం వెంట ఉన్న డీలర్ భర్త రహీముద్దీన్‌ను అదుపులోకి తీసుకొని విచారించామని చెప్పారు. కరీంనగర్‌కు చెందిన రేషన్ బియ్యం బ్రోకర్ రేవల్లి అనిల్ డీలర్ వద్ద 16 రూపాయలకు కొనుగోలు చేసి వాహనం ద్వారా సిరిసిల్ల మీదుగా కామారెడ్డికి తరలించి కిలోకు రూ. 21విక్రయిస్తున్నాడని తెలిపారు. ఇలా గత కొన్ని రోజులుగా రేషన్ బియ్యం దందా నడిపిస్తున్నట్లు నింధితులు పోలీసుల విచారణలో తెలిపారన్నారు. అనిల్‌కుమార్ కారులో ముందు వస్తు పోలీసుల తనిఖీలను పరిశీలి స్తున్నాడని చెప్పారు. వెనుక బియ్యం డ్రైవర్‌కు సమాచారం ఇస్తూ గుట్టు చప్పుడు కాకుండా తరలించి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పీడీఎస్ బియ్యం విక్రయించిన చెల్పూర్ రేషన్ డీలర్ సహన సుల్తానా, అందుకు సహకరించిన రహీం, ట్రాలీ డ్రైవర్ అనిల్‌కుమార్‌లతో పాటు మరో ముగ్గురు రేషన్ బియ్యం బ్రోకర్లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి సెల్‌ఫోన్, రూ. 10వేల నగదు, మహేంద్ర ట్రాలీ వాహనాన్ని సీజ్ చేశామన్నారు. రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఎస్సై సాంబయ్య, సిబ్బంది అవినాష్, కుమార్, మొండయ్యను ఏసీపీ అభి నందించారు. సమావేశంలో టౌన్ ఇన్‌చార్జీ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై సాంబయ్య పాల్గొన్నారు.

సింగరేణి పీఆర్‌వోకు జర్నలిజంలో డాక్టరేట్

కరీంనగర్ (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/గోదావరిఖని, ఫిబ్రవరి 10: సింగరేణిలో పీఆర్‌వో పనిచేస్తున్న శ్రీరాముల శ్రీకాంత్‌కు జర్నలిజంలో డాక్టరేట్ లభించింది. నిజామాబాద్‌లో తెలంగాణ విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్‌ను ప్రకటించింది. రోల్ ఆఫ్ సోషల్ మీడియా ఇన్ సోషల్ అండ్ పొలిటికల్ మూమెంట్స్ ఏ కేస్ స్టడీ ఆఫ్ తెలంగాణ మూమెంట్ అన్న అంశంపై ఇష్లా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం పర్యవేక్షణలో శ్రీకాంత్ పరిశోధన చేశారు. సామాజిక, రాజకీయ ఉద్య మాల్లో సోషల్ మీడియా బలమైన పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలోని సోషల్ మీడియా పాత్ర ఎక్కువ ఉందనే విషయాన్ని తన పరిశోధన పత్రంలో సమర్పించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కాపువాడకు చెందిన శ్రీకాంత్ ఎంఎస్‌సీ(ఎలక్ట్రానిక్స్), ఎంబీఏ, ఎంసీజే, ఎంఎస్‌డబ్ల్యూ పూర్తి చేశాడు. ఎనిమిదేళ్లుగా సింగరేణి కాలరీస్‌లో వెల్ఫేర్ ఆఫీసర్‌గా, పర్సనల్ అధికారిగా పనిచేస్తున్న శ్రీకాంత్ ప్రజాసంబంధాల అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జీఎం కోఆర్డినేషన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సురేష్, తదితరులు శ్రీకాంత్‌ను అభినందించారు.



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్

ఏటీఎంను కొల్లగొట్టిన దుండగులు

- రూ.27.75లక్షల నగదు అపహరణ
- మరో ఏటీఎంలో చోరీకి యత్నం
- సెక్యూరిటీ అలర్ట్ సమాచారం ఇవ్వడంలో జాప్యం
- రంగంలోకి పోలీస్ బృందాలు



సీసీ కెమెరాకు స్ప్రే చేస్తున్న దుండగుడు, ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో తొలగింపు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 10: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి తరువాత ఏటీఎం దోపిడీ దొంగలు తెగబడ్డారు. రెండు ఏటీఎంలలో చోరీకి యత్నించారు. ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని హనుమాన్ దేవాలయం పక్కన ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసి 27.75లక్షల నగదును ఎత్తుకెళ్లారు. గోదావరిఖని గంగానగర్‌లోని రాజీవ్ రహదారి పక్కన ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించి విఫలమయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి 1.30గంటలకు రాజీవ్ రహదారి పక్కన గంగానగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలోకి మంకీ క్యాప్ ధరించి స్ప్రే, కట్టర్‌లతో చొరబడిన దొంగలు సీసీ కెమెరాలకు స్ప్రే చేశారు. అనంతరం ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా వాహనాల కదలికలు ఉండడంతో విరమించుకున్నారు. అర్ధగంట వ్యవధిలో ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలోకి చొరబడిన దొంగలు సీసీ కెమెరాలకు స్ప్రే చేసి ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేశారు.అందులో ఉన్న రూ.27.75లక్షలను ఎత్తుకెళ్లారు. ఏటీఎం సెక్యూరిటీ అలర్ట్ సిస్టం కు సమాచారం వెళ్లింది. ముంబైలో ఉన్న ఈ సెక్యూరిటీ అలర్ట్ విభాగం దోపిడీ జరిగిన గంట తరువాత రామగుండం పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. శనివారం తెల్లవారుజా మున 3గంటలకు గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ జీవన్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీ, ఇతర వివరాలను సేకరించారు.

● రెక్కీతోనే చోరీ..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏటీఎంను కొల్లగొట్టిన ముఠా రెక్కీతోనే చోరీకి పాల్పడినట్టు తెలుస్తుంది. ఏటీఎంలలో పలు ప్రైవేట్ సంస్థలు నగదు నింపే కాంట్రాక్టు తీసుకున్నాయి. హిటాచి సంస్థ బసంత్‌నగర్‌లోని ఎస్‌బీఐ చెస్ట్ బ్యాంకు నుంచి శుక్రవారం రూ.30లక్షలు తీసుకువచ్చి గౌతమినగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో లోడ్ చేసింది. సాధారణంగా సాయంత్రం పూట సంబంధిత ఏజెన్సీలు ఏటీఎంలలో నగదు పెడతాయి. బ్యాంకుల సమయం వరకు ప్రజలు తమ అవసరం మేరకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లో చోరీకి పాల్పడిన ముఠా గతంలో ఈ తరహా చోరీలకుపాల్పడిన ముఠాగా అనుమానిస్తున్నారు. గంగానగర్‌లో ఏటీఎం రాజీవ్ రహదారి పక్కన ఉండడం, వాహనాలు, జనం కదలికలు ఉండడంతో దాన్ని విర మించుకున్నారు. తరువాత అర్ధగంట వ్యవధిలో గౌతమినగర్‌లో ఘటనకు పాల్పడ్డారు. వీరు వాహనంలో వచ్చినట్టు భావిస్తున్నారు. ఒక కారు గౌత మినగర్ రోడ్డు పక్కనే నిలిపి ఉండడం, వాహనాలు వచ్చే సమయంలో పార్కింగ్ లైట్లు వేసినట్టు గుర్తించారు. ఘటన జరిగిన కొద్ది సమయం ముందు పోలీస్ పెట్రోలింగ్ వాహనం అక్కడి నుంచి వెళ్లినట్టు తెలుస్తుంది.

● సెక్యూరిటీ లేదు.. అలర్ట్ సిస్టమూ లేదు..

గతంలో ఏటీఎంలలో ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని నియమించే వారు. ఇప్పుడు సెక్యూరిటీ సేవలను నిలిపివేశారు. దీనికి తోడు ఎక్కడైనా ఏటీఎంలు ధ్వంసం చేసినా, చోరీ చేసినా ముంబైలోని సెక్యూరిటీ అలర్ట్ విభాగానికి సమాచారం వెళుతుంది. క్షణాల్లో సంబంధిత పరిధిలోకి వచ్చే పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. శనివారం తెల్లవారుజామున గౌతమినగర్‌లో ఏటీఎం చోరీ ఘటన తరువాత గంటసేపటికి కానీ పోలీసులకు సమాచారం అందలేదు. దీంతో నిందితులను పట్టుకోలేకపోయారు. ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా టీములు నిందితుల కోసం గాలిస్తున్నాయి. ఏటీఎంలో డబ్బులు లోడ్ చేసే హిటాచి సంస్థ ప్రతినిధి రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌డీసీ జయశ్రీ యాదాద్రి జిల్లాకు బదిలీ

పెద్దపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న జయశ్రీని యాదాద్రి జిల్లా భూసేకరణ విభాగం యూనిట్ 2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆమె స్థానంలో రాజేంద్రనగర్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఇ మల్లయ్యను ఇక్కడికి బదిలీ చేశారు.

'కొండూరి' నియామకం హర్షణీయం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 10 : నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా వరుసగా రెండవసారి కొండూరి రవీందర్‌రావు తిరిగి నామినేట్ కావడం హర్షణీయమని కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, సహకార శాఖ ఉద్యోగుల సంఘం నాయకుడు బూరుగు సంతోష్ అన్నారు. శనివారం సహకార సంఘం కార్యలయంలో వారు మాట్లాడుతూ రెండవసారి పాలక మండలి సభ్యునిగా తిరిగి నామినేట్ అయ్యారని వివరించారు. ఇది రాష్ట్ర సహకార రంగానికి, ప్రత్యేకించి కరీంనగర్ జిల్లా ప్రజలకు గర్వకారణమని వారు వివరించారు.

'ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన మోదీ'



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 10: దేశంలోని ప్రజల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి వాటిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థవంతంగా అమలు చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్ అన్నారు. శనివారం 30వ డివిజన్‌లో బీజేపీ నాయకులు పంగ రవి ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, మోదీ చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరిస్తూ క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాతంగి రేణుక, మామిడి సంపత్, అడ్డూరి రాజేష్, మంద శ్రీనివాస్, అరిగెల శ్రావణ్, మల్లేష్, బ్రహ్మం పాల్గొన్నారు.

మహాలక్ష్మి దరఖాస్తులను పరిశీలించిన ఆర్డీవో

సుల్తానాబాద్, ఫిబ్రవరి 10 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో భాగంగా మహాలక్ష్మి పథకంలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్ పరిశీలించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో మహాలక్ష్మి పథకం గృహజ్యోతి కార్యక్రమంలో భాగంగా 500రూపాయలకు అందించే గ్యాస్ సిలిండర్ దరఖాస్తులతోపాటు లబ్ధిదారుల ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, గ్యాస్ వినియోగం నంబర్, కంపెనీ పేర్లు, ఎల్‌పీజీ నంబర్లు తదితర వివరాలను యాప్‌లో డౌన్‌లోడ్ చేసే విధానాన్ని పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

మోడల్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల వితరణ

ముత్తారం, ఫిబ్రవరి 10 : మండల పరిధిలోని దర్యాపూర్‌లోగల మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికైన నితిన్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలో విద్యార్థికి గోల్డ్ మెడల్

ఓదెల, ఫిబ్రవరి 10: కొత్తగూడెంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలో కొలనూర్ జడ్పీహెచ్ఎస్ చెందిన విద్యార్థి ఆర్.సౌమ్యశ్రీ గోల్డ్ మెడల్ సాధించింది. జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలో ప్రథమ స్థానం లభించగా రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అనంతరం కొత్తగూడెంలో అండర్ 12 షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించడంపై పీఈటీ ప్రణయ్, హెచ్ఎం ఏసుదాసు, విద్యార్థిని ఎంఈవో రాజయ్య అభినందించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 10 : స్థానిక శ్రీవాణి జూనియర్ కళాశాలలో ఈనెల 12న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు నోముల శ్రీనివాస్‌రెడ్డి కార్యదర్శి ఆడెపు సమ్మయ్య కోశాధికారి రాయల్ల నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, అవసరం ఉన్నవారికి కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

రాఘవపూర్‌లో అనుమానితుడికి దేహశుద్ధి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : మండలంలోని రాఘవపూర్‌లో శనివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తికి గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. గ్రామంలో ఫోన్ మాట్లాడుకుంటూ అనుమానితంగా సంచరిస్తూ బాలిక వైపు చూస్తుండిపోయినట్లు స్థానికులు తెలిపారు. దీంతో గ్రామస్థులకు అనుమానం వచ్చి పలు విషయాలపై ఆరా తీసినప్పటికి వివరాలు తెలుపకపోవడంతో స్థానికులు కర్రలతో చితకబాదారు.స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

నారాయణపూర్‌లో ఇల్లు దగ్ధం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 10 : మండలంలోని నారాయణపూర్‌లో బోగ సుమలత నివాస గృహం శనివారం ఉదయం ప్రమాదవశాత్తు కాలిపోయింది. పెద్దపల్లి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలార్పగా, అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైందని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదన్నారు. తక్షణ సహాయం కింద బాధితురాలి కుటుంబానికి ఐదు వేల రూపాయలు, క్వింటాల్ బియ్యం అందించినట్లు తహసీల్దార్ తెలిపారు.

'శ్రీవాణి'లో వార్షికోత్సవ సందడి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 10 : స్థానిక శ్రీవాణి జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ సంబరాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థి విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆటపాట అలరించాయి. కార్యక్రమంలో శ్రీవాణి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ విజయ డైరెక్టర్ రేకులపల్లి సుష్మ శశాంక్ ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హన్మంతునిపేటలో సమ్మక్క జాతరకు ముమ్మర ఏర్పాట్లు

- తుర్కలమద్దికుంట, పెద్దకల్వలలోనూ కొనసాగుతున్న పనులు - పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు



హన్మంతునిపేటలోని సమ్మక్క-సారలమ్మ దేవాలయం



జాతర ప్రాంతంలో భూమి చదును చేయిస్తున్న నిర్వాహకులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : రెండేళ్లకోకసారి జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు పెద్దపల్లి మండలంలోని మూడు గ్రామాల్లో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. తుర్కలమద్దికుంట, హన్మంతునిపేట, పెద్దకల్వల గ్రామాల్లో జాతర కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట గ్రామాల్లో జాతరకు భారీగా ప్రజలు హాజరుకానున్నారు. జాతరకు వచ్చే భక్తులు ఉండేందుకు భూమిని చదును చేయడంతో పాటు, తాగునీరు, విద్యుత్ ఏర్పాట్లు, స్నానాలకు కెనాల్ వద్ద నల్లాల ఏర్పాట్లు చేస్తున్నారు. హన్మంతునిపేట గ్రామంలో ఈనెల 22నుంచి నిర్వహించే సమ్మక్క జాతరకు సుమారు లక్షకు పైగా భక్తులు వస్తారని, అందుకు తగ్గట్లుగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పొల్సాని సుధాకర్‌రావు తెలిపారు. జాతరకు వచ్చే భక్తు లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దపల్లి పోలీ సులు భారీ బందోబస్తు కల్పించనున్నారు.

● భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- హన్మంతునిపేట ఆలయ చైర్మన్, పొల్సాని సుధాకర్‌రావు



రెండేళ్ల కోకసారి నిర్వహించే వనదేవతల జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నాం, వైద్యం, విద్యుత్, రోడ్డు మార్గం, ఉండేందుకు భూమి చదును, తాగునీరు. స్నానాలకు నల్లాలు ఏర్పాటు చేశాం. భక్తులు ఉన్న చోట విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని కోరుతున్నాను.

మరమ్మతులకు నోచుకోని రైల్వే గేట్లు



ఓదెలలో రోడ్డు మరమ్మతులేని రైల్వే గేటు

ఓదెల, ఫిబ్రవరి 10 : రైల్వే గేట్లు దాటాలంటే ప్రయాణికులకు నరక ప్రాయంగా మారింది. ఏడాది క్రితం చదును చేసిన రైల్వేగేట్ల మధ్య రోడ్లు మళ్లీ మరమ్మతుకు నోచుకోకపోవడంతో, ప్రజలతో పాటు ప్రయాణికులు, భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఓదెల, పొత్కపల్లి రైల్వే గేట్లల్లో కొందరు కాంట్రాక్టర్లు నాసిరకంగా, నామమాత్రంగా రోడ్లు నిర్మించి బిల్లులు పొందారు. అవి ఏడాది కూడా గడవకముందేక చెదిరిపోయి బాటసారులకు, ప్రయాణికులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు కారణమవుతున్నాయి. దీంతో ఇప్పుడు వాహనదారులతో పాటు ప్రజలు గేట్లు దాటి పోవాలంటే నరకాన్ని అనుభవిస్తున్నారు. ప్రస్తుతం సమ్మక్క, సారలమ్మ జాతర కొనసాగనున్నందున ముందస్తు దర్శనం కోసం దేవాలయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. అలాగే రైలు దిగిన ప్రయాణికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులంతా మల్లికార్జున స్వామి క్షేత్రానికి నిత్యం వస్తుంటారు. ఏ జిల్లా నుంచి వచ్చిన ఇవే ముఖ్యమైన రైల్వే గేట్ల నుంచి రాకపోకలు ఉంటున్నాయి. ఈ సమయంలో గేట్ల మధ్య రోడ్లు సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. ఇటీవల ఓదెల మల్లికార్జున స్వామి జాతరకు వచ్చిన భూపాలపల్లి, జమ్మికుంట మండల బిజిగిరి షరీఫ్ ప్రాంతాలకు చెందిన వాహనదారులు ఓదెల రైల్వే గేట్ మధ్యలో కింద పడిపోవడంతో తీవ్ర గాయాలకు గురయ్యారు. ప్రస్తుతం ఓదెల మల్లన్న జాతరలో భక్తుల రద్దీ పెరుగుతున్నందున మరోసారి ప్రమాదాలు జరగకుండా రైల్వే గేట్ల మధ్యన రోడ్లను నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ప్రజలు రైల్వే ఉన్నతాధికారులను కోరుతున్నారు.

దేశ ఆర్థికాభివృద్ధికి పీవీ ఎనలేని కృషి



మంథనిలో పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పుట్ట మధు



ఖనిలో పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంథని, ఫిబ్రవరి 10: ఆర్థిక సంక్షోభంలో ఉన్న భారత దేశాన్ని ఆర్థికాభివృద్ధి బాట పట్టించడానికి, అనేక సంస్కరణలు దేశంలో అమలు చేయటానికి దేశ ప్రధానిగా పీవీ నర్సింహారావు ఎనలేని కృషి చేశారని జడ్పీ చైర్మన్ పుట్ట మధు కొనియాడారు. మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావును గౌరవిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై పుట్ట మధు హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక పాత పెట్రోల్ పంపు చౌరస్తాలో ఉన్న పీవీ విగ్రహానికి శనివారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థిక పరిస్థితులు దెబ్బతిని ప్రజలంతా ఇబ్బందులు పడుతున్న తరుణంగా ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించి దేశ ఆర్థిక స్థితిగతులను మార్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. మంథని నియోజకవర్గం నుంచి రెండో శాసన సభ్యుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, దక్షిణ భారతదేశం, తెలుగు జాతి నుంచ మొట్టమొదటి ప్రధాన మంత్రిగా పీవీ పని చేయడం గౌరవకారణమన్నారు. పీవీ చేసిన ఎన్నో గొప్ప పనులే ప్రస్తుతం ఎందరో రాజకీయ నాయకులకు మార్గదర్శకంగా మారాయన్నారు. కాంగ్రెస్ పార్టీ గాంధీ కుటుంబీకులను తప్ప ఇతరులను ఎప్పుడు పట్టించుకోలేదన్నారు. పీవీకి భారత ఇవ్వాలని కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధాన మంత్రి మోదీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు.

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాని, దివంగత పీవీ నర్సింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించడాన్ని స్వాగతిస్తూ శనివారం గోదావరిఖని చౌరస్తాలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మహంకాళి స్వామి, కొలిపాక సుజాత మాట్లాడుతూ అనేక పదవులు చేపట్టిన పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా దేశానికి సమర్థవంతమైన సేవలందించి నూతన సంస్కరణలను తీసుకువచ్చి దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లారన్నారు. ఆర్థికరంగ నిపుణులైన మన్మోహన్‌సింగ్‌ను రాజకీయాల్లోకి ఆహ్వానించి దేశ ఆర్థిక శాఖ మంత్రిగా ప్రోత్సహించారని, ప్రపంచ బ్యాంకులో తాకట్టులో ఉన్న రాజభరణాలను విడిపించిన ఘనత పీవీ నర్సింహారావుకు దక్కుతుందన్నారు. బహుభాషా కోవిదులైన పీవీ జీవితం అందరికి ఆదర్శమని, ఆయన అడుగు జాడల్లో కాంగ్రెస్ కార్యకర్తలు నడవాలని పిలుపునిచ్చారు. మంథని నుంచి రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన పీవీ నర్సింహారావు నిజాయితీ నిబద్ధతతో దేశ రాజకీయాలను నడిపారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు సుతారి లక్ష్మణ్‌బాబు, బొమ్మక రాజేష్, కొలిపాక మల్లయ్య, కొప్పుల శంకర్, నాయిని ఓదెలు, కళ్యాణి సింహాచలం, గట్ల రమేష్, కుడిదెల శివ, ఫజల్‌బేగ్, మాలెం మధు, అనుమ సత్యనారాయణ, కౌటం సతీష్, యాకూబ్, మమత, ప్రత్యూష, కనకలక్ష్మి, చారి, ఉదయ్‌రాజ్, గడ్డం శేఖర్, పంజా శ్రీనివాస్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యం హర్షణీయం'

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.21389 కోట్లు కేటాయింపు చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కేటాయింపుల మేరకు ఖర్చు జరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వడం శుభసూచకమని పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలకు సంబంధించి పీఆర్సీ, డీఏ వంటి అంశాలు బడ్జెట్ ప్రసంగంలో లేకపోవడం కొంత బాధించిందని పేర్కొన్నారు. బడ్జెట్ చర్చ సందర్భంగానైనా పీఆర్సీ అమలు, ఫిట్‌మెంట్‌లపై విస్పష్టమైన ప్రకటన చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

రేపటి నుంచి వీరబ్రహ్మేంద్ర ఆలయంలో బ్రహ్మోత్సవాలు

ధర్మారం, ఫిబ్రవరి10: మండలంలోని కటికెనపల్లిలో గల శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈనెల 12 నుంచి 16వరకు జగద్గురు బ్రహ్మోత్సవాలు, మహా జాతర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 12న గణాధిపతి పూజలు అభిషేకాలు, 13న 16గోమాతల పూజ, కలశస్థాపన, బోనాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. 14న కల్యాణమహోత్సవం, 15న భగవద్గీత పారాయణ, సామూహిక కుంకుమార్చన, మధ్యాహ్నం రథోత్సవం, మహా జాతర జరుగుతుందని వారు పేర్కొన్నారు. 16న ఆదిత్య యజ్ఞ మహోత్సవం కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ధర్మారం, ఫిబ్రవరి10: ధర్మారం మండలం దొంగతుర్తిలో చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ ఉప సర్పంచ్ ముత్యాల చంద్రశేఖర్ కలెక్టర్‌కు విన్నవించారు. గ్రామంలో ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్లు, శ్మశానవాటిక, విద్యుత్ స్తంబాల ఏర్పాటుకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఏడాది నుంచి స్థానిక అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆయన ఫిర్యాదు చేశారు. సర్పంచ్ గ్రామాభివృద్ధికి సంబంధించిన నిధులను దుర్వినియోగం చేశాడనే అభియోగంతో ఆయనను సస్పెండ్ చేస్తే తాను ఇన్‌చార్జి సర్పంచ్‌గా 11నెలలు బాధ్యతలు స్వీకరించినా తనకు రావాల్సిన గౌరవ వేతనం ఇప్పటి వరకు చెల్లించలేదని ఆయన ఆవేదన వ్యక్త చేశారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో కోరారు.

సమ్మక్క జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి10: కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ తిరుపతిరెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. సమ్మక్క-సారలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21, 22, 23 తేదీల్లో జాతర ఉండడంతో మీర్జంపేట గ్రామానికి లక్ష నుంచి 1.5లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీవో రాంమోహనచారి, ఎంపీవో గోవర్ధన్, ఎస్ఐ శ్రీనివాస్, కమిటీ చైర్మన్ ఉయ్యాల అశోక్, ఉయ్యాల సుమన్, సిరికొండ కొమురయ్య, పోచాల సందానం, మూల రాజు, కెక్కెర్ల రాజమల్లు, రామిడి వెంకట్‌రెడ్డి, ఉయ్యాల నరేష్ పాల్గొన్నారు.

'పంచాయతీ నిధుల వివరాలు ఇవ్వాలి'

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి10: కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామ పంచాయతీకి 2019 నుంచి ఐదేళ్ల కాలంలో వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలు ఇవ్వాలని అదే గ్రామానికి చెందిన కౌంజు కుమారస్వామి, మండల పంచాయతీ అధికారి గోవర్ధన్‌ను కోరారు. ఈ మేరకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు అందించినట్లు కుమారస్వామి తెలిపారు. వచ్చిన నిధులు, పన్నుల ద్వారా జమ అయిన మొత్తం, ఖర్చు వివరాలతో కూడిన పూర్తి సమాచారం ఇవ్వాలని దరఖాస్తులో కోరారు.

ఇటుక బట్టీ యజమానిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 10: కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తించిన సాయి బ్రిక్స్ యజమాని పైండ్ల విష్ణుపై చర్యలు తీసుకోవాలని శనివారం పౌరహక్కుల సంఘం నాయకులు అదనపు కలెక్టర్ అరుణశ్రీకి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టి బ్రిక్స్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని. ఆదివాసీ వలస కార్మికులను వారి స్వస్థలాలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డుపెల్లి రవి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు నార వినోద్, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు ఇట్లుపుల్ల సుచరిత తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కుట్టు శిక్షణ

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 10: మహిళల అభ్యున్నతి కోసమే గౌతమి రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో మహిళలకు శిక్షణ ఇస్తున్నట్టు ట్రస్ట్ నిర్వాహకురాలు సోమారపు లావణ్య చెప్పారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన పది మందికి శనివారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు ట్రస్ట్ ద్వారా 22 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్లను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ శిరీష, సంధ్య, మయూరి, పద్మ, మాధవి, స్వర్ణలత, రజిత, రేణుక, స్రవంతి, వైష్ణవి పాల్గొన్నారు.

నియామకం

పెద్దపల్లిటౌన్ ఫిబ్రవరి 10: తెలంగాణ స్టేట్ మెడికల్ కో ఆప్షన్ సభ్యుడిగా పెద్దపల్లికి చెందిన డాక్టర్ ప్రణీత్‌ను నియమించినట్లు స్టేట్ చైర్మన్ డాక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. ప్రణీత్ నియమకం పట్ల డాక్టర్లు, పీ మల్లేశం, రమకాంత్, రాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. తనకిచ్చిన బాధ్యత పట్ల చిత్తశుద్ధితో పని చేస్తానని ప్రణీత్ హామీ ఇచ్చారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు



ఇసుక లారీలను అడ్డుకుంటున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 10: ఇసుక లారీలతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని లారీలను మండల కేంద్రంలో గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. మండల కేంద్రం నుంచి నిత్యం పదుల సంఖ్యలో ఇసుక, దుబ్బ లారీలు వెళ్లడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, లారీల నిండుగా ఇసుక వేయడం వల్ల దుమ్ము అంతా దుకాణాల్లోకి వస్తున్నాయని వ్యాపారులు వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు కాల్వ శ్రీరాంపూర్ గ్రామం మీదుగా పదుల సంఖ్యలో ఇసుక లారీలు, దుబ్బ లారీలు వెళుతుండడంతో రహదారులు మొత్తం ధ్వంసం అవుతున్నాయని, వాహనదాల దాటికి దుమ్ముతో రహదారి పరిసర ప్రాంత వాణిజ్య, వ్యాపార సంస్థలతో పాటు గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారని కరీంనగర్, భూపాలపల్లి జిల్లాల నుంచి లారీలు కాల్వ శ్రీరాంపూర్ గ్రామం మీదుగా వెళుతుండడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, అధికారులు వెంటనే స్పందించి ఇసుక లారీలు, దుబ్బ లారీలు రాకుండా చూడాలని కోరుతున్నారు.



ఉత్పత్తి సాధనలో సర్వీస్ విభాగాల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 10: కంపెనీ ఉత్పత్తి సాధనలో సర్వీస్ విభాగాల పాత్ర కీలకమని ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ అన్నారు. శనివారం జీఎం ఆఫీస్‌లో జరిగిన మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ సిబ్బంది ఉద్యోగులకు వైద్య సేవలు అందించడం, సివిల్ విభాగం కార్మిక వాడల్లో శుభ్రత, నీటి సరఫరా, క్వార్టర్ల మెయింటనెన్స్ నిర్వహించడం జరగుతుందని అన్నారు. జీఎం ఆఫీస్ సిబ్బంది ఉద్యోగుల సంక్షేమం, లావాదేవీలు, పదోన్నతులు వంటివి నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి విధులను సమర్థవంతంగా నిర్వహించినపుడే సంస్థ పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ప్రతినిధి శివశంకర్, అధికారులు రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, వెంకట రామచంద్ర, హరినారాయణ, బుక్యదేశాయి, షరీఫ్ మహమ్మద్‌తో పాటు జీఎం ఆఫీస్ సిబ్బంది, రెస్క్యూ, ఎంవీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- డైరెక్టర్(ఆపరేషన్, పా) ఎన్‌వీకే శ్రీనివాస్ - పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ (ఆపరేషన్,పా) ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని, ఫిబ్రవరి 10: రామగుండం రీజియన్‌లోని ఉద్యోగుల సంక్షేమం, సమస్యలను త్వరితగతిన ప్రకటించాలని పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులకు డైరెక్టర్ (ఆపరేషన్, పా) ఎన్‌వీకే శ్రీనివాస్ సూచించారు. శనివారం ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో ఆర్జీ-1,2,3 పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిపెండెంట్ ఉద్యోగాలు, పెండింగ్ నామినేషన్, టర్మినల్ బెనిఫిట్స్, క్వార్టర్ల కేటాయింపు, గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్ తదితర సమస్యలను ప్రతి నెల సమీక్షించాలని, డిపార్ట్‌మెంట్‌లో నూతన నామినేషన్ షెడ్యూల్ ప్రకారం ఎంత మంది పెట్టుకున్నారు, పని చేసి చనిపోయిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన, మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులతో కారుణ్య నియామకాల ఉద్యోగాలు భర్తీచేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, పర్సనల్ అధికారులు లక్ష్మీనారాయణ, కిరణ్‌బాబు, రాజేంద్రప్రసాద్, హరీష్, రాజేషం పాల్గొన్నారు.

జీడీకే 2, 2ఏ గనిని సందర్శించిన డైరెక్టర్(ఆపరేషన్)

ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 2, 2ఏ ఇంక్లైన్‌ను శనివారం డైరెక్టర్(ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్ సందర్శించారు. గనిలోపల పని స్థలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని వెలికితీయాలని, వినియోగదారులకు సకాలంలో బొగ్గు రవాణా చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఏజెంట్ చంద్రశేఖర్, సర్వే ఆఫీసర్ ప్రభాకర్, మేనేజర్ రామస్వామి, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.

కనుమరుగైన అధికారుల పాదయాత్రలు

- ఊసెత్తని యూనియన్ల నేతలు
- పరిష్కారం కాని సమస్యలు

రామగిరి, ఫిబ్రవరి 10: కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించే దిశగా సంస్థ చేపట్టిన అధికారుల పాదయాత్ర సింగరేణి వ్యాప్తంగా కనుమరుగైంది. కరోనా ప్రభావంతో డివిజన్‌లలోని కాలనీ ప్రాంతాల్లో చేపట్టే అధికారుల పాదయాత్ర రెండు సంవత్సరాలుగా నిలిచిపోయింది. అన్ని విభాగాలకు చెందిన అధికారులు కాలనీల్లో పాదయాత్రలు నిర్వహిస్తూ కార్మిక కుటుంబాలు ఎదుర్కొనే సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణం పరిష్కరించే వెసులుబాటును ఉండేదిది. తాగునీరు, విద్యుత్ సమస్యలు, డ్రైనేజీలు, వృక్షాల తొలగింపుతో పాటు రూఫ్‌లీకేజీ సమస్యలు ప్రతి నెల నిర్వహించే అధికారుల పాదయాత్రలో ప్రధాన సమస్యలుగా కార్మికుల వెల్లడించేవారు. కానీ రెండు సంవత్సరాలు కాలనీల్లో పలు సమస్యలతో కార్మిక కుటుంబాలు సతమతం అవుతున్నారు. చిన్న సమస్యలు సైతం పరిష్కారం దొరకడంలేదని కార్మిక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెలిచిన సంఘాలు సైతం పాదయాత్రల పునరుద్ధరణకు చర్యలు చేపట్టడం లేదని వాదన కార్మిక కుటుంబాల నుంచి బలంగా వ్యక్తం అవుతుంది. జీఎం కార్యాలయం చుట్టు ప్రదక్షిణాలు చేసిన సమస్యలు పరిష్కారానికి నోచుకొవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.